క్లుప్తంగా

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

దహెగాం: మండలంలోని దేవాజీగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రసన్నాంజనేయ సహిత ఆలయంలో మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నవగ్రహాల పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనప్ప –రమాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, బీబ్రా సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మన ఊరు – మన బడి' పనులు పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఎంఈవో

రెబ్బెన: మన ఊరు – మన బడిలో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని వంకులం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో జాయ్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్‌కు హాజరైన విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను అభివృద్ధి పరిచేలా కృత్యాలు ఉపయోగించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, రాజకమలాకర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా 'అరిగెల' జన్మదిన వేడుకలు


శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ మందిరంలో జరుపుకున్నారు. నాగేశ్వర్‌రావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ రాజేశం, ఎంపీపీ మల్లికార్జున్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కౌటాల, బెజ్జూర్, వాంకిడి మండలాల్లో సైతం జన్మదిన వేడుకలు నిర్వహించారు. అడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, వెంకన్న, గుండ వెంకన్న, నర్సింహ స్వామి, రాముగౌడ్, పట్టణ అధ్యక్షుడు అహ్మద్, వైస్ ఎంపీపీ పెంటయ్య, ఉబేద్ బిన్ యాహియా, నిసార్, ఎండీ అహ్మద్, ఎండీ తాజ్, షాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : కస్టడీ
కాగజ్‌నగర్
వెంకటరమణ : కస్టడీ
– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	60
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

–ఆసిఫాబాద్‌అర్బన్

ఖరీఫ్‌కు సన్నద్ధం..!

- వేసవి దుక్కులతో ఎంతో మేలు
- భూసారం పెరుగుదల
- తెగుళ్ల నివారణకు అవకాశం


కనికి శివారులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

కౌటాల: వేసవిలో దుక్కులు దున్నడం వల్లరైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసారం పెరగడంతో పాటు తెగుళ్ల నివారణకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈక్రమంలో పత్తి సాగు చేసిన రైతులు పత్తి కర్రలను కాల్చిన అనంతరం దుక్కులు దున్నిస్తున్నారు. వేసవిలో ఎండిన పత్తి కర్రను కాల్చడంతో భూమిలో ఉన్న చీడ, పీడలు నశించిపోతాయి. సరిపడా తేమ ఉన్న చేను, పొలాల్లో సుమారు 9 అంగుళాల లోతు తగ్గకుండా దుక్కులు చేసుకోవాలి.

30వేల ఎకరాల్లో సాగు..

ఈ ఖరీఫ్‌లో మండలంలో 30వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈసారి మండలంలో పత్తి 20వేల ఎకరాలు, వరి 8వేల ఎకరాలు, కంది 2వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ చేనుల్లో ఇప్పటికే రైతులు 40 నుంచి 50 శాతం మేర దున్ని సిద్ధంగా ఉంచారు. మిగిలిన దుక్కులు దున్నడానికి సన్నద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలకు ముందు వేసవిలోనే దుక్కులు దున్నడం వల్ల పంటల అవశేషాలు దుక్కిలో కుళ్లి కర్బన శాతం పెరుగుతుంది. చేనుల్లో పురుగులు, గుడ్లు ఉంటే దున్నడం వల్ల పైకి తేలి సూర్యరశ్మి తగిలి చనిపోతాయి. నీటి నిలువ సామర్థ్యం 50శాతం పెరుగుతుంది. లోతు దుక్కుల వల్ల కలుపు మొక్కలు మట్టి కిందకు చేరి సేంద్రియ ఎరువుగా మారుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తుంగ, గరిక, దర్భ, జమ్ము వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలకు తీవ్ర నష్టం చేస్తుంటాయి. వీటి వేర్లు, దుబ్బులు, కాయలు నేలలో బాగా విస్తరించి ఉండడంతో నివారణ చాలా కష్టమవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు కలుపు మొక్కలు, కాయలు, దుంపలు, వేర్లు పెకిలించబడుతాయి. పంట కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటివి లోతుగా దుక్కి దున్నడంతో నేలలో కలిసి కుళ్లిపోతాయి. దీంతో నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది.

దున్నకుంటే నష్టాలు..

కోతల తర్వాత దుక్కి దున్నకుండా వదిలేయడంతో భూమి గాలిని పీల్చుకునే శక్తి కోల్పోతుంది. దుక్కి దున్నక పోవడంతో లోతైన పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం, పది రోజుల ముందు దుక్కులు తయారు చేయడం వల్ల ఆశించినంత దిగుబడి రాకుండా పోతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఖర్చులు తగ్గుతాయి



ఏటా వేసవిలో దుక్కులు దున్నుకుంటాం. నాకున్న 5 ఎకరాల్లో ట్రాక్టర్లతో దున్నిస్తాను. వేసవిలో లోతుగా దుక్కి దున్నడంతో రాలిన ఆకులు నేలలో కలిసి కుళ్లిపోతాయి. సేంద్రియ ఎరువులు చల్లి మళ్లీ దున్నుకుంటాం. దీంతో వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోనే ఇంకుతుంది. ఖర్చులు సైతం తగ్గుతాయి. ప్రస్తుతం గ్రామాల్లో రైతులు జోరుగా వేసవి దుక్కులు దున్నిస్తున్నారు.

– రత్నం మల్లయ్య, గురుడుపేట్

వేసవిలో దున్నాలి



రైతులు చేను, పొలాలను వేసవిలో దున్నుకోవాలి. దీంతో నేలలో ఉన్న పురుగులు చనిపోతాయి. నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరుగుతాయి. రైతులు జీలుగ విత్తనాలు వేస్తే భూములు సారవంతమవుతాయి. దీంతో విత్తనాలు మొలకెత్తి, పంటలు ఏపుగా పెరిగి పంట అధిక దిగుబడి వస్తుంది.

– పాలకుర్తి రాజేశ్, వ్యవసాయాధికారి, కౌటాల

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


తల్లి స్థానంలో హాజరైన తనయుడు (వృత్తంలో వ్యక్తి)

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో పూర్తిస్థాయిలో చర్చ జరగలేదు.

విద్యుత్ శాఖ, ఐసీడీఎస్, నీటిపారుదల శాఖపై చర్చ

సమావేశంలో విద్యుత్‌శాఖ నివేదికలను ఏఈ రవీందర్ చదివి వినిపించగా గ్రామాల్లోని ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కన్నెపల్లి, వీరవెల్లి గ్రామాల సర్పంచులు మోర్లె రమేశ్, ద్రౌపతి అన్నారు. ప్రధాన రహదారి వెంబడి ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్లతో లాక్కెళ్తున్నారని ఎంపీటీసీ మోతిరాం అన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం రైతుల వద్ద నుంచి విద్యుత్ అధికారులు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సాండ్‌గాం సర్పంచ్ దామోదర్ ఆరోపించారు. కౌటాలలో తరుచూ కరెంట్ కోతలు విధిస్తున్నారని, ముందస్తు సమాచారం లేకుండా ఎందుకు విద్యుత్ కోతలు విధిస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు. అనంతరం నీటిపారుదల శాఖ నివేదికలను ఏఈఈ ఇనోష్, పృథ్వీ సభ్యులకు చదివి వినిపించారు. బోదంపల్లి, వీరవెల్లి, పాత కన్నెపల్లి గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడం లేదని సర్పంచులు రెడ్డి శంకర్, ద్రౌపతి అన్నారు. ఐసీడీఎస్ శాఖ నివేదికలను సూపర్‌వైజర్ షకీరాబేగం చదివి వినిపించగా అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నవి, నాసిరకం గుడ్లు పంపిణీ చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరవడం లేదన్నారు.

పలు శాఖలపై నామమాత్రపు చర్చ

మండల సర్వసభ్య సమావేశంలో విద్యాశాఖ నివేదికలను ఎంఈవో సోమయ్య, పశుసంవర్థకశాఖ నివేదికలను పశువైద్యాధికారి శ్రీకాంత్, వైద్యశాఖ నివేదికలను వైద్యురాలు నవత, ఈజీఎస్ నివేదికలను ఏపీవో పూర్ణిమలు చదివి వినిపించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఓటర్ లిస్ట్‌లో తప్పులు ఉంటే సవరించుకోవాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. అనంతరం ఐకేపీ శాఖ, పంచాయతీరాజ్ శాఖ నివేదికలను ఆయా శాఖల అధికారులు సభ్యులకు చదివి వినిపించారు.

మండల అభివృద్ధికి కృషి..

సమావేశంలో ఎంపీపీ విశ్వనాథ్ మాట్లాడుతూ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామాల్లో సక్రమంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, తహసీల్దార్ సాయన్న, ఎంపీవో మౌనిక, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లికి బదులు తనయుడు

మండల సర్వసభ్య సమావేశంలో నిబంధనలకు విరుద్ధంగా శీర్షా సర్పంచ్ కదారి కనుకక్కకు బదులుగా ఆమె కుమారుడు కదారి భీమయ్య సమావేశానికి హాజరయ్యారు. అయినా సమావేశం ప్రారంభం నుంచి ముగింపు వరకు సమావేశంలో ఉన్న అధికారులు సైతం గుర్తించలేదు. సమావేశం అనంతరం పలువురు ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో నస్రుల్లా ఖాన్‌ను వివరణ కోరగా సమావేశంలో తల్లికి బదులు తనయుడు వచ్చినట్లు గుర్తించలేదని, మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలి


సమ్మె చేస్తున్న వీవోఏలు


మాట్లాడుతున్న రాచకొండ శ్రీవర్ధన్

దహెగాం: న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఐకేపీలో పని చేస్తున్న వీవోఏలు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వాటిని నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీవోఏల సమ్మె మంగళవారం 30వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు రాజు, మల్లేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

బెజ్జూర్: ఐకేపీ వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిర్పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం 30వ రోజుకు చేరుకోగా, వారికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం నెలరోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి, అధ్యక్షుడు గోరంట్ల విజయ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, సహా కార్యదర్శి సుజాత, ప్రధాన కార్యదర్శి పెద్దల సంతోష్, ఉపాధ్యక్షుడు మంజెం కేశవ్, శంకర్, నీలయ్య, మధుసూదన్, ప్రమీల, జయసుధ, జలపతి, దేవాజి తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాలి క్రిష్ణమాచారి అన్నారు. ఐకేపీ వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట మండలంలోని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 30వ రోజు మంగళవారం కొనసాగింది. సమ్మెలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ములే దత్తు, వీవోఏలు భీంరావ్, శంకర్, శ్యాంరావ్, కొండయ్య, రవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో చాలామంది ఓటర్లు ఆధార్ నంబర్‌ను ఓటర్ కార్డులతో అనుసంధానం చేయలేదని, ప్రతీ ఒక్కరు విధిగా చేయించుకోవాలని కాగజ్‌నగర్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొత్త ఓటర్ల నమోదు సవరణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. త్వరలోనే పాలకవర్గం సభ్యులు, బల్దియా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రక్రియను మరింత వేగవంతం చేసే విధంగా చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ మునవర్ షరీఫ్, ఏవో బికరన్‌దాస్, ఆయా పార్టీల నాయకులు వీవీ ప్రసాద్, ముబీన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత ర్యాంకులు సాధించిన మాలి వర్గం విద్యార్థులను మాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణం తిలక్‌నగర్ కాలనీలోని మాలి సంఘ భవనంలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తెలంగాణ మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్ రూ. 5వేల నగదు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10లక్షల మహర్ కులస్తులు ఉన్నారన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం మహర్ కుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహర్‌ల ఐక్యత కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కృష్ణారావు

సిర్పూర్(టి): రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అయన మాట్లాడుతూ రైతులు దళారుల మాటలకు మోసపోవద్దని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లోనవెల్లి సర్పంచ్ కంటం చంద్రకళ, ఏపీఎం దుర్గయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఏఈవోలు శ్రీనివాస్, నేహా తబస్సుమ్, చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య, నాయకులు ప్రేంసాగర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు కల్లాలు క్షుణ్ణంగా పరిశీలించాలి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో దయాకర్

బెజ్జూర్: తునికాకు కల్లాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎఫ్ఆర్‌వో దయాకర్ అన్నారు. మంగళవారం రేంజ్ కార్యాలయంలో బీట్, సెక్షన్ ఆఫీసర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు యూనిట్ల పరిధిలోని తునికాకులను సంబంధిత బీట్, సెక్షన్ ఆఫీసర్లు పర్యటించాలని సూచించారు. ప్రతీ కూలీకి సంబంధించి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధంగా చూడాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో బీట్, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల వేలం


వేలంలో పాల్గొన్న వ్యాపారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సయ్యద్ తాలిబ్ అలీషాబాబా దర్గా ప్రాంగణంలో ఈ నెల 30, 31న నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాల్లో వ్యాపారాల నిర్వహణకు మంగళవారం వేలం నిర్వహించారు. స్వీట్‌హౌజ్ దుకాణాన్ని రూ.లక్ష 14వేలతో మహ్మద్ ఇస్మాయిల్, టీ హోటల్‌ను రూ. 35,500లకు శఫాత్ హుస్సేన్, పాన్‌షాప్‌ను రూ. 12వేలతో సయ్యద్ నిసార్, భోజనం హోటల్‌ను రూ. 10,500లకు షేక్ ఆసిఫ్‌లు వేలంలో దక్కించుకున్నారు.

'వీఆర్‌ఏల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లండి'


ఎమ్మెల్యే సక్కుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు మంగళవారం వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొడప వినోద్, కేదారి, ప్రేమ్‌సాగర్, వసంత్, శంకర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో ఎన్నికల కోసం మరో పోరాటం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ సంస్థలో హైకోర్టు తీర్పు ప్రకారం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కేంద్రంలోని డిపో గేటు ఎదుట మంగళవారం కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు హక్కుల సాధనకు 55 రోజులు సమ్మె చేశారని తెలిపారు. అప్పుడు సీఎం ఆర్టీసీ యూనియన్లను రద్దు చేసి, కొత్తగా నియమించిన వెల్ఫేర్ బోర్డులు పైరవీలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. యూనియన్లు లేకపోవడంతో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కార్మికులపై వేధింపులు పెరిగాయని ఆరోపించారు. సత్వరమే ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయాలని, లేని పక్షంలో ఈ నెల 30న ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి దివాకర్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, నాయకులు మారు, రఘులయ్య, తేజ, మల్లేశ్, భీంరావు, శంకర్, కిరణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలి


వాటర్‌బాటిళ్లు అందజేస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌టౌన్: రోజురోజుకూ ఎండ తీవ్రత పెరిగిపోతుందని, తగు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసులు విధులు నిర్వర్తించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మంగళవారం డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బందికి వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, వడగాలుల నుంచి రక్షణ కోసం కూలింగ్ గ్లాసెస్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వర్తించే సమయంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బ్లూకోట్ సిబ్బంది, పెట్రోకార్ సిబ్బంది, బందోబస్తు పోలీసు సిబ్బందికి అధిక ఉష్ణోగ్రతల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దే స్వామి, కాగజ్‌నగర్ ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు


దహెగాం: క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీపీ

దహెగాం: క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని ఎంపీపీ కంబగొని సులోచన అన్నారు. మంగళవారం మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ చౌదరి సురేశ్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సీఎంకప్ క్రీడలు కొనసాగుతున్నాయి. మంగళవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు కొనసాగాయి. కబడ్డీలో అంబరావుగూడ, నిసాని, దేవాపూర్, సాంగ్వి, నెహ్రూనగర్, కెరమెరికి చెందిన క్రీడాకారులు పాల్గొనగా, వాలీబాల్‌లో అనార్‌పల్లి, అంతాపూర్, మోడి, సాకడ, ఖోఖోలో మోడి, సాకడ, అథ్లెటిక్స్ 100 మీటర్లలో 8, 400 మీటర్లలో 8 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, పీఈటీలు శ్రీనివాస్, పాండురంగ్, నాగోరావు, అరవింద్, నర్సయ్య ఉన్నారు.

కౌటాల: యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సీఎంకప్ మండలస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్‌లో ముత్తంపేట్ జట్టు, కబడ్డీలో మొగడ్‌దగడ్ జట్టు, రన్నింగ్‌లో కౌటాల, మొగడ్‌దగడ్ క్రీడాకారులు గెలుపొందినట్లు పీఈటీలు ఎంఎల్ రాజు, శ్రీనివాస్ తెలిపారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సాయన్న, సర్పంచులు శ్రీనివాస్, దామోదర్, రాందాస్, సునంద, రేణుక, ద్రౌపతి, ఎంపీటీసీ మోతిరాం, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని జిల్లా వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.